

ప్రశ్నాపత్రాలను పాఠశాలలకే పంపాలి : యుటిఎఫ్



మొగల్తూరు: పరీక్ష పేపర్లను పోలీస్ స్టేషన్ నుంచి తీసుకొచ్చే విధానాన్ని విడనాడాలని యుటిఎఫ్ మొగల్తూరు మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు సిద్దయ్య శెట్టి పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి తెస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సిద్ధయ్య శెట్టికి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, పాలకోడేరు మండలం నుంచి బొర్రా శ్రీనివాస్, కె.శ్రీనివాస్, దిరుసుమర్రు నుంచి సిహెచ్.పెద్దిరాజు, కాళ్ల మండలం నుంచి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెడ్‌పిలో జరిగేదేంటి..?

నేడు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం

జెడ్‌పి ఛైరపర్సన్ తీరుపై గతంలో వైసిపి సభ్యుల నోటీసు

సమావేశంలో చర్యలకు పట్టుబడతారా.. మౌనం వహిస్తారా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా ప్రద్మశ్రీ టిడిపిలో చేరడంపై వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు అప్పట్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమెపై అనర్హత వేటు వేయాలంటూ దాదాపు 30 మంది వైసిపి సభ్యులు డిమాండ్ చేయడంతోపాటు జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం అందించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ప్రత్యేక సమావేశానికి తేదీ ప్రకటించినప్పటికీ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో చివరి నిముషంలో రద్దు చేశారు. జిల్లా పరిషత్‌కు చేరుకున్న వైసిపి సభ్యులు అధికారులతో వాగ్వివాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చిన తర్వాత వారంతా ఆందోళన విరమించారు. ఈ నెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో 21వ తేదీ ఉదయం జెడ్‌పి ప్రత్యేక సమావేశం, మధ్యాహ్నం నుంచి సాధారణ సమావేశం జరపనున్నట్లు జెడ్‌పి అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం జరగనున్న ప్రత్యేక సమావేశంలో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అవిశ్వాస తీర్మానం ఇచ్చినా చెల్లుబాటు కాదు!

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారిపై నాలుగేళ్ల వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదని చట్టం చెబుతోంది. అనర్హత వేటు ప్రతిపాదన సైతం జరిగే అవకాశం లేదు. ప్రత్యేక సమావేశంపై కొద్దిరోజుల క్రితం పెద్దఎత్తున గలాటా చేసిన వైసిపి సభ్యులు ఇప్పుడు మౌనంగా ఉన్నారు. దీంతో శనివారం సమావేశంలో ఎవరూ మాట్లాడే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఒకరిద్దరు మాట్లాడినా పెద్దగా ఇబ్బంది పట్టించుకునే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

ఎలక్ట్రికల్ సామగ్రి పార్శిల్ పేరిట

డెడ్‌బాడీ డోర్ డెలివరీ

వార్త మెయిన్‌లో..





పార్శిల్ వచ్చిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి, మృతదేహం వచ్చింది ఈ పెట్టెలోనే

సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌ఛార్జులే

నిరాశలో కూటమి నేతలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల ఎన్నికలను ఇప్పట్లో జరిపే అవకాశం లేనట్లు తేలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సహకారం సంఘాలకు ఎన్నికలు జరుగకుండా ప్రత్యేక అధికారులను నియమించింది. డిసెంబర్ 21వ తేదీతో ప్రత్యేక అధికారుల పాలనా కాలం ముగిసిపోతుంది. నీటిసంఘాల ఎన్నికలు పూర్తి కావడంతో సహకార సంఘాల ఎన్నికలను సైతం ప్రభుత్వం పూర్తి చేస్తుందని అంతా భావించారు. ప్రభుత్వం మాత్రం మళ్లీ ప్రత్యేక అధికారుల పాలనవైపే మొగ్గు చూపింది. మరో ఆరు నెలలు ప్రత్యేక అధికారులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో మరో ఆరునెలలపాటు సహకార సంఘాలకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. 2013లో సహకార సంఘాల ఎన్నికలు జరగ్గా, 2018లో పదవీ కాలం పూర్తయ్యింది. ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. వైసిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలతో ముందుకు సాగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనతో ముందుకు సాగుతోంది.

ఏలూరు జిల్లాలో 159 సహకార సంఘాలు ఉండగా, పశ్చిమలో 122 ఉన్నాయి. రెండు, మూడు సహకార సంఘాలకు ఒక్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. దీంతో అన్ని పనులు చూసుకోవడం ప్రత్యేక అధికారులకు ఇబ్బందిగా మారింది. ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాప్రతినిధుల పాలన సాగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం అందుకు భిన్నంగా ముందుకు సాగుతుండటం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా సహకార సంఘాల పదవుల కోసం కూటమి నేతలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. మరోసారి ప్రత్యేక అధికారులను నియమించడంతో నాయకులంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

అమిత్ షా వ్యాఖ్యలపై కొనసాగిన నిరసనలు



గణపవరం మండలం అర్ధవరంలో..



యలమంచిలి మండలం చించినాడలో..

ప్రజాశక్తి - యలమంచిలి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ చించినాడలోని అరుంధతీపేటలో చిల్డ్రన్స్ పార్కులో సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ అమిత్‌షా తక్షణం క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, పల్లేరు వెంకటస్వామి, ముస్కుడి విజయకుమార్, ఆకుమర్తి పద్మరాజు, పల్లేరు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం స్థానిక కాలేజీ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, నేతలు ఎస్‌విఎన్.శర్మ, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, కొండే సత్యనారాయణ, కుసుమ జయరాజు, ఉన్నమట్ల దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, పాదుషా పాల్గొన్నారు.

భీమవరం టౌన్: అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని వెంపలో సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడగా, కార్యక్రమంలో వర్ధనపు కన్నమ్మ దాసు, వేగిపాటి పెద్దిరాజు, మోహన్‌రావు, వర్ధనపు నర్సింహులు, ఇంజేటి శాంతారావు, చిలకపాటి లాజర్, పోలుకొండ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యాన అర్ధవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇంకా అంబేద్కర్ ఇండియన్ మిషన్ నాయకులు బళ్లారపు అశోక్ మాట్లాడగా కటూరి ప్రసాద్, చిన్నం వంశీ, కార్తిక శేఖర్, మానుకొండ రామయ్య, శివ, మొగసాల శ్రీను పాల్గొన్నారు.

వీరవాసరం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యాన స్థానిక పెదపేటలో నిరసన తెలిపారు. తొలుత ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కానూరి శ్రీకాంత్, మద్దాల సాయి, మేడపాటి సాగర్ పాల్గొన్నారు.

ఉండి: అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకుని, ఆయనను మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో సిపిఐ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, నాయకులు సనపల శ్రీనివాస్ పాల్గొన్నారు.



తణుకులో న్యాయవాదుల రాస్తారోకో

ఐలు ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి - తణుకు

అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులో ఐలు ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం నేడు ఉందని, రాజ్యాంగ స్వరూపాన్ని మార్చడానికి కొంత మంది ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రయత్నాలను ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, ట్రెజరర్ హెచ్.నాగార్జునదాసు, న్యాయవాదులు జి.అంబేద్కర్, పొట్ల సురేష్, బి.విక్టర్‌బాబు, చింతపల్లి నాగేశ్వరరావు, ఎం.శ్యాంసన్, జంగం వెంకటేశ్వరరావు, పిల్లి రవికుమార్, రవి, కె.వెంకట్రావు, చిట్టి మోషే, ఐ.వెంకటేశ్వరరావు, మేడపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

చివరి అంకానికి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ - పశ్చిమలో ఒకటి, ఏలూరులో రెండు ప్రాజెక్టు కమిటీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరింది. ఈ నెల 14న వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరగ్గా, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు జరిగాయి. మూడో దశ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. పశ్చిమలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు భీమవరంలోని కలెక్టరేట్‌లో జరగనుండగా, ఏలూరు జిల్లాలోని తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో, ఎర్రకాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జంగారెడ్డిగూడెం ఎండిఒ కార్యాలయంలో జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు ఎన్నుకోనున్నారు. ఏలూరు జిల్లాలోని ప్రాజెక్టు కమిటీలు మీడియం ఇరిగేషన్‌కు సంబంధించినవి కావడంతో జిల్లాలో ఎన్నికైన వాటర్ యూజర్ అసోసియేషన్ కమిటీల అధ్యక్షులు ఎన్నుకోనున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. పశ్చిమగోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా ఇద్దరు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. పాలకొల్లుకు చెందిన మురళీకృష్ణంరాజు, నరసాపురం నాయకుడు పొత్తూరి రామరాజు ఆ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపి నాయకత్వం మురళీకృష్ణంరాజువైపే మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఏలూరులోని ప్రాజెక్టు కమిటీలకు మీడియం ఇరిగేషన్‌కు చెందిన ఇద్దరు పెద్దగా పోటీ లేదు. అధినాయకత్వం నిర్ణయించిన వారే కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

భీమవరంలో తల్లిపాల బ్యాంక్ ప్రారంభం

రాష్ట్రంలో రెండో తల్లి పాల బ్యాంకు ఇక్కడే -జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి




ప్రారంభిస్తున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

తల్లి పాల ప్రయోజనాలను ప్రతి తల్లీ అవగాహన కలిగి ఉండాలని, బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ఎంతో ఉపయోగకరమని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ దాతృత్వంతో సుశేణా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాత్రి తల్లిపాల బ్యాంకును, బాలింతల నిర్వహణ కేంద్రాన్ని జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మన భీమవరంలో తల్లి పాల బ్యాంకును ఏర్పాటు చేసుకోవడం సంతోషకర విషయమన్నారు. రాష్ట్రంలోనే భీమవరంలో రెండో తల్లి పాల బ్యాంకును ప్రారంభించామని, మొదటి తల్లిపాల బ్యాంకు కాకినాడలో ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నాలుగో వంతు పిల్లలు పోషణాలోపంతో ఉన్నారని, దీనిలో 40 శాతం మన దేశంలోనే ఉన్నారని అన్నారు. ఏడాదిలోపు పిల్లల మరణాలకు ముఖ్య కారణాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 53 శాతం శ్వాసకోస వ్యాధులు, 55 శాతం నీళ్ల విరేచనాల జబ్బులకు ప్రధాన కారణం ఆరు నెలల్లోపు పిల్లలకు తల్లి పాలు చక్కగా అందకపోవడమేనన్నారు. తల్లిపాలు ప్రకృతి సహజం అని, పోతపాలులో పోషకాలు చాలా తక్కువగా ఉంటాయని అన్నారు. నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సిసి) ఛైర్మన్ డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తల్లిపాలను గుర్తించి తమ సంస్థ సిఎస్ఆర్ నిధులతో తల్లి పాల బ్యాంకు ఏర్పాటుకు సహకరించినట్లు తెలిపారు. సుశేణా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు మాట్లాడుతూ తల్లులకు సమగ్ర లాక్టేషన్ మద్దతు అందించడానికి, శిశువులకు అత్యుత్తమ పోషణను నిర్ధారించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొలుత తల్లి పాల బ్యాంకు ప్రారంభానికి ముందు పూజ నిర్వహించి, రాత్రి బాలింతల నిర్వహణా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం యంత్రాల పని తీరు వివరాలను ధాత్రి లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తల్లి పాల సేకరణ, నిల్వ పరికరాలను జెసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, భీమవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవి కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయులు శ్రీనివాస రామానుజన్

ఎంఎల్‌సి బి.గోపీమూర్తి



మాట్లాడుతున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సూచించారు. శుక్రవారం సీసలిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో ముందస్తుగా గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని, నిత్యజీవితంలో గణితం ఉపయోగాన్ని వివరించారు. ఎంఇఒ ఎ.రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించి ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. అనంతరం గణితం ఉపాధ్యాయులు బి.రామకృష్ణ, అరుణకుమారిలను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ-2 జి.కనకరాజు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, ఉపాధ్యాయులు బిఆర్ఎంకె.స్వామి, బి.మురళి, ఎం.శంకర్, పి.పాపారావు, సత్యనారాయణ, శ్రీరామకృష్ణ, భోగరాజు అప్పలాచార్యులు, తిరుమలరావు, నరసింహరావు, విజయలక్ష్మి, కనకదుర్గ, గీత ప్రశాంతి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ వైద్యులు పని చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఏరియా హాస్పిటల్‌లోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత ప్రసూతి వార్డును సందర్శించి ఆపరేషన్ చేయించుకున్న బాలింతలను పలకరించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. శీతాకాలం కావడంతో ఆపరేషన్ చేయించుకున్న వారికి మరింత జాగ్రత్తగా వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సకాలంలో వైద్యం అందిస్తున్నారా లేదా, ఉదయాన్నే ఏ డాక్టర్ వచ్చారు అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు, సౌకర్యాలు ఎలా ఉన్నాయి ఆరా తీశారు. బాగా చూస్తున్నారని, సౌకర్యాలు బాగున్నాయని బాలింతలు సమాధానం ఇవ్వడంతో జెసి సంతృప్తి వ్యక్తం చేశారు. నవజాత శిశువును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎత్తుకొని పుట్టినప్పుడు బిడ్డ ఎంత బరువు ఉంది, ఇప్పుడు ఎంత ఉంది అని అడిగి తెలుసుకున్నారు. జెసి వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, హాస్పటల్ సూపరింటెండెంట్ బి.మాధవి కళ్యాణి, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల ర్యాలీ

ఆచంట: ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు కనీసం వేతనాల్లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్నీడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ స్థానిక రామేశ్వర స్వామి ఆలయం ఆవరణ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ ఫాదుషా, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, సిపిఎం మండల కార్యదర్శి మోహన్‌రావు, నేతలు బండి రంగారావు, టి.బుల్లబ్బులు, తోటపల్లి సత్యనారాయణ, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు, కొండేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని నిరసన

పెనుగొండ: విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోడిపందాల దిబ్బ వద్ద నేతలు విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, ప్రజలు పాల్గొన్నారు.

కేరళపై కేంద్రం మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి - పెంటపాడు

కేరళ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ సిరపరుపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కేరళ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అడుగడుగునా ఆంక్షలు విధించి అక్కడున్న వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు తెగనమ్మకుండా అక్కడున్న వామపక్ష ప్రభుత్వం వాటిని తన రాష్ట్ర పరిధిలో ఉండాలని పెద్ద ఎత్తున ప్రయత్నిస్తుందని వారు తెలిపారు. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.700 కనీస వేతనాన్ని, అలాగే కార్మికులకు రోజుకు రూ.1000 కనీస వేతనాన్ని అమలు చేస్తున్న రాష్ట్రం కేరళ అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రంపై వివక్షతను విడనాడి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంటి దుర్గ, తాడి బాలయ్య, వెలగల నాగిరెడ్డి, కొలుకుల రమేష్, అలింపిల్లి రామకృష్ణ, డేర్లా అన్నవరం, కర్రి అమ్మిరెడ్డి, కర్రి జనార్దన్ రెడ్డి, సత్తి నాగిరెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఆచంట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆయువు పట్టుగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. వల్లూరు పిహెచ్‌సి ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వైద్య ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేయడంలోనూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ సేవల్లో, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లోనూ హెల్త్ అసిస్టెంట్ల పాత్ర ప్రధానమైందన్నారు. ఆరోగ్యరంగానికి మూల స్తంభాలైన హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఆదేశాల సాకుతో ఒక్కసారిగా గొంతు కోసి ఉన్నఫళంగా ఉద్యోగాల నుంచి పీకేసి నట్టేట ముంచేయడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రభుత్వం తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డి.వేణుబాబు, ఎ.హైందవి, సూపర్‌వైజర్స్ ఎం.మోహన్, టి.వసంతకుమారి, బాధితులు బొబ్బా వెంకటరత్నం, బండారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మా గ్రామంలో డంపింగ్ యార్డు వద్దు

సర్వే సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్తులు

నరసాపురం: మండలంలోని రుస్తుంబాద గ్రామ శివారు మండవారిగర్వులో మున్సిపాల్టీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం సర్వే చేపట్టిన సిబ్బందిని ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని నినదించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం హద్దుల నిర్ధారణకు రుస్తుంబాద విఆర్‌ఒ కె.సత్తిబాబు, సచివాలయ సర్వేయర్, మున్సిపల్ సిబ్బంది శుక్రవారం అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మహిళలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని సిబ్బందిని ముట్టడించారు. వారితో వాగ్వివాదానికి దిగారు. నివాసాల చెంత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని అభ్యంతరం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వల్ల వచ్చే ఇబ్బందులను ఎంఎల్ఎ నాయకర్‌కు విన్నవించామని, ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టబోమని హామీ ఇచ్చారని తెలిపారు. దానికి భిన్నంగా కొలతలు వేయడం తగదని అన్నారు. దీంతో సిబ్బంది స్థానికుల ఆందోళనను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కమిషనర్ స్థానికులతో ఫోన్లో మాట్లాడుతూ ఎంఎల్ఎ హామీకి భిన్నంగా చర్యలుండవని చెప్పారు. స్థలాన్ని మున్సిపాల్టీ స్వాధీనం చేసుకునేందుకే కొలతలు వేస్తున్నారని తెలపడంతో స్థానికులు ఆందోళన విరమించారు. ఆందోళనలో మండా రమేష్, పులపర్తి మణి, మండా పూర్ణచందు, కాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి భారీగా చేరికలు

ఉండి: మండలంలోని చెరుకువాడ, వెలివర్రు, పాములపర్రు, ఆరేడు గ్రామాల సర్పంచులు భారీగా మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణంరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి రఘురామ కృష్ణంరాజు టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం కొండవీటి సాంబశివరావు, కేసన శాంతి కుమారి, పెన్మెత్స అంజనీదేవి, కట్టెద్ది బ్రహ్మానందం మాట్లాడుతూ పార్టీలకతీతంగా రఘు రామకృష్ణంరాజు వ్యవహరిస్తున్న తీరు గ్రామాలాభివృద్ధికి సహకరించడంతో ఆకర్షితులమై తాము టిడిపిలోకి చేరినట్లు తెలిపారు. వారి వెంట భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు టిడిపి కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరాజు, తోట శ్రీరాములు, ఇరింకి సత్యనారాయణ, గొల్లం వెంకటేశ్వరరావు, కేసన యడారియ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

నరసాపురం: ఇటీవల అనారోగ్యానికి గురై, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురికి విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం జనసేన కార్యాలయం వద్ద సిఎం సహాయ నిధి చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు అందజేశారు. మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామానికి చెందిన దూసనపూడి వరలక్ష్మికి రూ.35,000, కొత్తోట గ్రామానికి చెందిన రావి పెద్దిరాజుకు రూ.1,64,733, నరసాపురం పట్టణం రాయపేటకు చెందిన అల్లం శ్రీనివాసరావుకు రూ.1,40,407 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబాలకు, ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై చర్చ

మొగల్తూరు: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన చర్చల్లో తాము పాల్గొన్నామని సంఘం మండల అధ్యక్షులు చింతపల్లి క్షేమమోహన్ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్‌తో రాష్ట్రంలోని జెడిపి ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టూలపై చర్చించామన్నారు. ప్లస్ తరగతులకు తగిన వసతులు కల్పించాలని కోరామన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు. ఈ సమావేశంలో ఎంటిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, పాలకొల్లు మండలం నుంచి బొర్రా శ్రీనివాస్, కె.శ్రీనివాస్, దిరుసుమర్రు నుంచి సిహెచ్.పెద్దిరాజు, కాళ్ల మండలం నుండి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌలు రైతులు రుణాలపై అవగాహన సదస్సు

గణపవరం: మండలంలోని సిహెచ్ అగ్రహారంలో శుక్రవారం కౌలురైతుల రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రామ సర్పంచి చప్పా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం ఎడిఎ మురళీకృష్ణ మాట్లాడుతూ పిఎంబిఫై ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు బీమా పరిహారం అందుతుందని చెప్పారు. ఈనెల 31వ తేదీ నాటికి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ మండలంలో రీసర్వే జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గణపవరం ఎ.ఒ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

భట్లమగుటూరులో రెవెన్యూ సదస్సు

పెనుమంట్ర : పొలాలకు సంబంధించి సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని భట్లమగుటూరులో సర్పంచి బయ్యే సుగుణమ్మ అధ్యక్షతన కూటమి ప్రభుత్వ ఆదేశానుసారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొని పొలాలకు సంబంధించిన సమస్యల గురించి, పట్టాదార్ పాస్ బుక్కుల ఇంటి స్థలాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విఆర్‌ఒలు, సర్వేయర్లు వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ సెక్రటరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం పరిషత్ కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలపై 22 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా శిక్షణ ఇచ్చిన ఇఒపిఆర్‌డి టి.మూర్తి బాబును, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబును, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ సురేష్‌ను పంచాయతీ సత్కరించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఎస్.ఉమామహేశ్వరరావు, పూలపల్లి పంచాయతీ కార్యదర్శి పాల శ్రీనివాస్, పుల్లంపర్రు పంచాయతీ కార్యదర్శి ఎల్.సత్యనారాయణ, ఎపిఎం ఆజాద్, అధికారులు పాల్గొన్నారు.జెడ

తాడేపల్లిగూడెం : గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ తెలిపారు. మండల సమాఖ్య భవనంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరిమిల్లి రాజా శ్రీనివాస్, సర్పంచులు మద్దుకూరి గంగాభవాని, కుడుపల్లి హనుమంతు పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతున్న అధికారులు శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి మాట్లాడారు. ముగింపు తరగతుల నిర్వహణ కార్యక్రమాన్ని డిపిఆర్‌సి రిసోర్స్ పర్సన్ పాండురంగారావు పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

భీమవరం టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు తెలిపారు. మండలంలోని అనాకోడేరులో శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న కడలి రామాంజనేయులను అరెస్టు చేసి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పివిఎస్.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

'వార్డు మెంబర్‌పై కేసు నమోదు చేయాలి'

ఉండి: దళిత మహిళా సర్పంచి అయిన తనపై వార్డు మెంబర్ భర్త దాడి చేశాడని వెంటనే అతని పై కేసు నమోదు చేయాలని పంచాయతీ పక్కనే ఉన్న పోలీసు స్టేషన్ వద్ద ఉండి సర్పంచి కమతం సౌజన్య బెన్షర్ ధర్నా చేసేందుకు సిద్ధపడగా పోలీసులు వారించడంతో ధర్నాను విరమించుకున్నారు. దీనికి సంబంధించిన సర్పంచి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం ఉండి గ్రామ పంచాయతీ బోర్డు మీటింగ్ జరుగుతోందని, ఆ సమయంలో సభ్యులు తప్ప మరెవరూ మీటింగ్‌లో ఉండకూడదని చెప్పానని, అయినా 11వ వార్డు మెంబర్ కాగిత నాగమణి భర్త విజ్జి తనతో వాగ్వివాదానికి దిగాడని, తనపై రావడంతో క్షణికావేశంలో విజ్జిని కొట్టానని తెలిపారు. దీంతో ఆయన తనపై దాడి చేయడంతో పాటు తన భర్తపై కూడా దాడి చేశాడని తెలిపారు. తనపై, తన భర్తపై దాడి చేసిన కాగిత విజ్జిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా 11వ వార్డు మెంబర్ కాగిత నాగమణి మాట్లాడుతూ ఇటీవల గ్రామ పంచాయతీలో సుమారు రూ.80 లక్షలు వరకూ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు లేఖ రాశామని, దీంతో నేడు జరిగిన బోర్డు సమావేశంలో తన భర్త విజ్జిని సర్పంచి సౌజన్య బెన్షర్ కొట్టడంతో గొడవ మొదలైందని తెలిపారు. గ్రామ ప్రథమ పౌరురాలైన సౌజన్య బెన్షర్ తన భర్తపై దాడి చేయడం దుర్మార్గమని, దీనిపైనే తాము పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు నాగమణి వివరించారు.

నరసాపురంలో పోలీసుల తనిఖీలు

నరసాపురం: గంజాయి సరఫరా పెరుగుతుండడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్‌పి, నరసాపురం డిఎస్‌పి ఆదేశాలతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మూడు గంటల పాటు పట్టణంలో నరసాపురం పోలీసులు పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. సిఐ బి.యాదగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ బృందాలుగా విడిపోయి రాయపేట, అరుంధతిపేట, ఎన్‌టిఆర్ కాలనీ, కొత్త కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, క్రిస్టియన్ పేట తదితర కాలనీల్లో పలువురు ఇళ్లలో సోదాలు చేశారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన ముద్దాయిలు, బానిసలైన వారి కదలికలను, గమనించేందుకు కొన్ని ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సిహెచ్.జయలక్ష్మి, వై.నాగలక్ష్మి, ఎస్.ముత్యాలరావు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాల కోసం కృషి

పాలకొల్లు రూరల్: పేదరికం లేని, ఆరోగ్యకరమైన గ్రామాలను తయారు చేసేందుకు అందరూ కృషి చేయాలని ఎంపిడిఒ ఎస్ఎన్.ఉమా మహేశ్వరరావు తెలిపారు. పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయంలో వద్ద సుస్థిర అభివృద్ధి పై మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు అధ్యక్షత శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం భీమవరం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం భీమవరంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లులు మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్నారన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వం లేవీ విధానంలో తీసుకొచ్చిన మార్పుల కారణంగా రైస్ మిల్లులు నిర్వహించలేని పరిస్థితిలో యజమానులు ఉన్నారన్నారు. తణుకు షుగర్ ఫ్యాక్టరీ, వేండ్ర పేపర్ మిల్లులు వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకునేవన్నారు. ఆక్వా రంగం అభివృద్ధి చెందాలని, పాలకులు చెబుతూనే ఎటువంటి సహకారం చేయకపోవడం వల్ల ఆ రంగం కుదేలవుతోందన్నారు. ఉపాధి కోసం వలసలు తీవ్రమయ్యాయని, ఏ ప్రాంతంలోనూ కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు జరగకపోవడం వల్ల ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకుని కొత్త పరిశ్రమలు నిర్మించి, మూతబడిన పరిశ్రమలను తెరిపించి ఉపాధి సమస్యను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కృష్ణ, కోదండమ్, ఆదినారాయణ, మజ్జి నాగేశ్వరరావు, సాంబ, నాగరాజు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కాళ్ల

సమాజంలో ప్రజల మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని భీమవరం ఏరియా హాస్పిటల్ మానసిక వైద్య నిపుణులు టి.శంకర్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భీమవరం ఏరియా హాస్పిటల్ మానసిక వైద్య నిపుణులు టి.శంకర్ మానసిక వ్యాధుల ప్రత్యేక క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ఈ క్యాంపులో మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కొన్ని మందులు కూడా ఏలూరు ప్రభుత్వ హాస్పిటల్ నుంచి రప్పించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైద్య అధికారి సరాబు సునీల్ మాట్లాడుతూ ప్రతి నెలలో ఒక రోజు మానసిక వైద్యులు మన హాస్పిటల్‌కు విచ్చేసి మానసిక రోగులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కాళ్ల మండల ప్రత్యేక అధికారి ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్యాంసుందర్ పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి టి.భావన పాల్గొన్నారు.

వైఎన్‌కు రూ. 2 లక్షల విరాళం

ప్రజాశక్తి - నరసాపురం


బిజిబిఎస్ మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఇంగ్లీష్ హెడ్ మేజర్ సి.నీరజ వైఎన్ కళాశాల 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ఆమె తండ్రి రిటైర్డ్ జడ్జి జాకబ్ జ్ఞాపకార్థం రెండు లక్షల రూపాయలను కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనక రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జడ్జి చొప్పల జాకబ్ చాలా మంచివారని, ఆయన ఇంగ్లీష్ పరిజ్ఞానం అపూర్వమని తెలిపారు. ఆయన రాసిన పుస్తకాలు, లిటరేచర్ చాలా అమూల్యమన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘు రామారావు, ఇతర గవర్నింగ్ బాడీ సభ్యులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో అప్పన ఫణి, మల్లేశ్వరరావు, రంగారావు, నమిల్లి శ్రీను పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేను పాటించాలి

తాడేపల్లిగూడెం: ఆరోగ్య నియమాలు పాటించి, ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 33, 34, 35వ వార్డుల్లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకొని వారానికోసారి ఫ్రైడే డ్రైడే పాటించినట్లయితే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు రత్నకుమారి ఆశాలు స్వాతి, ఇ.కాంతారావు పాల్గొన్నారు.

కల్నల్ అమిత్ పాండేకు సత్కారం

భీమవరం: 19వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండేను డిఎన్ఆర్ కళాశాల విద్యాసంస్థలు శుక్రవారం ఘనంగా సత్కరించాయి. వార్షిక తనిఖీల్లో భాగంగా డిఎన్ఆర్ కళాశాలను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.మోజస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల క్యాడెట్లు కల్నల్ అమిత్ పాండేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లు సిలబస్ ప్రకారం సకాలంలో శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. దేశానికి రక్షణ కల్పిస్తున్న త్రివిధ దళాల్లో చేరి దేశానికి సేవ చేయడానికి ముందుకు రావాలని కోరారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల ఎన్‌సిసి విభాగం అన్ని రకాలుగా చక్కటి ప్రతిభ కనబరుస్తూ, మంచి ఫలితాలు సాధిస్తూ, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండడం గర్వకారణమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ మాట్లాడుతూ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లకు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది దేశ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని సత్తాచాటిన కళాశాల క్యాడెట్ ఎం.పవన్ సాయి విఘ్నేష్‌ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో సైనిక సంక్షేమ నిధికి సేకరించిన విరాళాలు మొత్తం రూ.33,922 చెక్కును కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండేకు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు అందజేశారు. అనంతరం, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే ఎన్‌సిసి విభాగం పనితీరును సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేసి, కళాశాల ఎన్‌సిసి కంపెనీని అన్ని విధాలా ముందుకు నడిపిస్తున్న ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్యను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కల్నల్ అమిత్ పాండేను ఘనంగా సత్కరించారు.


ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సొసైటీ సిఇఒ శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది

నిజాలను నిర్భయంగా రాసేది ప్రజాశక్తి

2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా సంక్షేమం కోసం వారి సమస్యలను అనునిత్యం వెలికితీస్తూ నిజాయతీగా, నిర్భయంగా వార్తలను ప్రచురించే సామర్థ్యం ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే ఉందని కాళ్లకూరు సొసైటీ సిఇఒ ఐ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాళ్లకూరు సొసైటీ కార్యాలయంలో ప్రజాశక్తి 2025 నూతన క్యాలెండర్ ఆయనతో పాటు సొసైటీ సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా ప్రజాశక్తి పత్రిక నిలుస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, బడుగు, బలహీన, మైనార్టీల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాళ్ల మండలం నుంచి మూడు లక్షల 65 వేల రూపాయల యాడ్స్ సేకరణ చేసి సింగల్ క్యాలెండర్‌గా తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి భీమవరం డివిజన్ ఇన్‌ఛార్జి గుండా సాయికుమార్, ప్రజాశక్తి కాళ్ల మండల విలేకరి గొట్టేటి శ్రీనివాసులు, సొసైటీ సిబ్బంది వి.ప్రకాష్ వర్మ, సిహెచ్.వి.రామకృష్ణ, వి.సత్యనారాయణరాజు, ఎస్.త్రిమూర్తులు, జి.అప్పారావు, సిహెచ్.నాగప్రసాద్, జె.లక్ష్మి, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ కళాశాలలో 3, 5 సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నవంబర్ చివరి వారంలో ఈ రెండు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని వివరించారు. మూడో సెమిస్టర్‌లో మొత్తం 157 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 66.24 శాతంతో 104 మంది ఉత్తీర్ణులయ్యారని, అలాగే ఐదో సెమిస్టర్‌లో 148 విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 91.22 శాతంతో 135 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ పూర్వ విద్యార్థి అడ్వకేట్ డి.శేషగిరిరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రదర్శన

నరసాపురం: విద్యుత్‌ను ఆదా చేద్దాం భావితరాలకు వెలుగునిద్దామంటూ శుక్రవారం ఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, వినియోగదారులు, సిబ్బంది పట్టణంలో భారీ ప్రదర్శన చేశారు. విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం నుంచి పురవీధుల గుండా సాగిన ఈ ప్రదర్శనలో తొమ్మిది మండలాలు, మూడు పట్టణాల ఎడిఇ, ఎఇలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్లో విద్యుత్‌ను ఆదా చేస్తామంటూ విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ సిబ్బంది, ప్రజల చేత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరిగిపోతోందన్నారు. ఈ వినియోగం తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ ర్యాలీ మిషన్ జ్ హైస్కూల్ మీదుగా వెళ్తుండగా జనసేన కార్యాలయంలో ఉన్న విప్, ఎంఎల్ఎ నాయకర్‌ను విద్యుత్ ఉద్యోగులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకర్ ప్రతిజ్ఞ చేశారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడిఇలు ఓంకార్, వెంకట్రావు, రామకృష్ణ, కె.రాంబాబు, ఎఇలు ప్రభాకర్ రావు, రాజీవ్, సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణరాజు జయంతి

తణుకు: శతాధిక గ్రంథ రచనలు చేసి, తెలుగురాజుగా, కవి రాజుగా, కళాప్రపూర్ణ బిరుదులతో విశేష కీర్తిని గడించింది పెనుమత్స సత్యనారాయణరాజు అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. శుక్రవారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో జనతా హాస్పటల్ ప్రాంగణం వద్ద తెలుగురాజు పెనుమత్స సత్యనారాయణరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెనుమత్స రామరాజు మాట్లాడారు. అనంతరం దంతవైద్యులు దాట్ల సత్యనారాయణరాజు, పెనుమత్స రామరాజు, విశ్రాంత జనరల్ మేనేజర్ ఫైనాన్సు సెంట్రల్ ఇందుకూరి మాధవ కృష్ణ సత్యనారాయణరాజును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బంగారు రమేష్‌కుమార్, బొల్లాడ నాగరాజు, కొవ్వూరి వెంకటరెడ్డి, ఈడుపుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు భవిష్యత్ తరాలకు అవసరం

భీమవరంటౌన్: ఇంధన పొదుపు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని, విద్యుత్‌ను పొదుపు చేయడం సామాజిక బాధ్యత అని జిల్లా ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆలపాటి రఘునాథ్ బాబు అన్నారు. శుక్రవారం భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో ఎలక్ట్రికల్ డిఇ కార్యాలయంలో విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రఘునాథ్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలని, ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందన్నారు. ఎలక్ట్రికల్ డిఇ ఎస్.వెంకటేశ్వరరావు, ఎడిఇ కె.రాంబాబు, ఇంజినీర్ పద్మశ్రీ మాట్లాడుతూ టివి, మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టిన తరువాత స్విచ్ ఆఫ్ చేస్తే కొంత వరకూ కరెంట్ ఆదా అవుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. రంగసాయి పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, కె.రాంబాబు, బాపూజీ, ఎలక్ట్రికల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపనలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 2వ వార్డు గాయత్రీదేవి ఆలయం వద్ద రూ.33.93 లక్షలతో కాంఫౌండ్ వాల్ నిర్మాణం, నిట్ కాలేజ్ ఎంట్రన్స్ పశ్చిమ ద్వారం వద్ద రూ.40 లక్షలతో సీసీ డ్రెయిన్, కల్వర్టు నిర్మాణం, బాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద రూ.4.98 లక్షలతో సీసీ డ్రెయిన్ తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎనిమిది కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. జువ్వలపాలెంలో తాగునీటి కొరత ఉందని, త్వరలోనే అందరికీ తాగునీరు అందే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 8 గ్రాముల బంగారం విరాళం

భీమవరం టౌన్: మావుళ్లమ్మకు గొల్లవానితిప్పకు చెందిన కొప్పర్తి వెంకట సత్యనారాయణ, నాగరాణి దంపతులు ఎనిమిది గ్రాముల బంగారం, హైదరాబాద్‌కు చెందిన ఎన్.ప్రశాంత్ నాయుడు రెండు గ్రాముల బంగారాన్ని శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ వీరికి పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

పంటల బీమాలో చేరండి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రతి రైతూ తమ పంటను బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి శ్రీనివాస్ సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచి వేండ్ర వెంకట లీలాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎడి మాట్లాడుతూ ఎకరాకు రూ.625 ప్రీమియంను రైతులకు ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర పరిస్థితుల ఎదురై పంట నష్టపోతే ఆ నష్టాన్ని బీమా పరిహారం కింద ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. నిర్ణీత సమయంలో ఎంపిక చేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ పథకానికి కౌలు రైతులు కూడా అర్హులేనన్నారు. ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఒ బిన్నీబాబు, కెనరా బ్యాంకు మేనేజర్, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రతి రైతూ కేంద్ర ప్రభుత్వం వారి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోషిలా కోరారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు, మార్టేరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోషిలా మాట్లాడారు. ప్రతి రైతూ ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన ద్వారా దాళ్వాకు పంటల బీమా చేసుకోవడం ద్వారా అనుకోకుండా సంభవించే విపత్తులకు నష్టపరిహారం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది బి.దుర్గాప్రసాద్, జి.కృష్ణగంగ, రైతులు కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - తణుకు

పోటీల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం ఏర్పడుతుందని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి అన్నారు. శుక్రవారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో గణితశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్స్, గణాంకశాస్త్రం విభాగాల వారు సంయుక్తంగా ఇగ్నైట్-2024 కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ పోటీల్లో పలు కళాశాలల నుంచి సుమారు 175 మంది విద్యార్థులు, ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల నుండి 360 మంది పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెవి.రామకృష్ణ, కె.పద్మజారాణి, ఎన్‌విఎన్‌ఎ.కుమార్, టి.భద్రకాళి, సిహెచ్.నాగరాజు, వివివి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.